

అబ్బో! పన్నెండున్నరే! కాస్సేపు పడకకుర్చీలో వాలకపోతే నా పని ఖాళీ! అబ్బబ్బ! పొద్దుటినుంచి పని, ఆ పైన భుక్తాయాసం! అన్నం తిన్నాక కనీసం ఓ అరగంటైనా మేను వాల్చకపోతే మతి పోతుంది. పక్కమీదికి ఎక్కితే ఎంత వద్దనుకున్నా నిద్ర వచ్చేస్తుంది! మధ్యాహ్నం నిద్ర పోతే శరీరంకూడా పెరుగుతుందట! ఆ భయమే కాకుండా తరవాత వచ్చే బద్ధకం మరి పని చెయ్యనియ్యదు. అందుకని పడకకుర్చీయే రైటు! ఎంత అలిసి ఉన్నాసరే దీంట్లో కూర్చుంటే చాలు! భలే రిలీఫ్‌గా ఉంటుంది. అలా కూచుని గంటలు కొద్దీ ఆలోచిస్తూనో, చదువుకుంటూనో తను గడిపెయ్యగలదు! ఆఁ గంటలెక్కడ? ఖాళీ అంతా పన్నెండు నించి మూడు వరకేగా?! తరవాత పిల్లలకు టిఫిను చేయడం, ఆ తరవాత వంట! అంతలో పిల్లలు వస్తారు. లెక్కకు ఇద్దరైనా పదిమందితో సమానం వాళ్ల అల్లరి! పేచీలు, తగాలు తీర్చి వాళ్లను ముస్తాబుచేసి తను ముస్తాబయ్యేసరికి శ్రీవారు రెడీ! సరే, మళ్లీ పిల్లలు, చదువులు, భోజనాలు, నిద్ర వగైరా, తెల్లవారింది మొదలు మళ్లీ ఇప్పటివరకు! సరిగా ఇదీ రోజూ జరిగే కార్యక్రమం. కానీ, తనకీ మూడు గంటలు మటుకు చాలా అమూల్యమైనవి. ఏ పక్కింటి సోదరో వచ్చి అప్పుడప్పుడు అన్యాయంగా అపహరించేయడం? మరి తప్పదు! మొత్తానికి పడకకుర్చీ అంటే తనకు ప్రాణం. నెమ్మదిగా ఊగుతూ, చదువుకుంటున్నా, చిన్న కునుకు తీసినా, ఏవో ఊహాగానాలు చేసినా భలే బావుంటుంది. ఓ మహారచయిత్రి ఇల్లాంటి కుర్చీలో కూచునే బోలెడు రాశారుట!

ఈ వేళ తారీకెంత చెప్మా? పదమూడా? రేపు పద్నాలుగు. ఓహో! సరే సరే రేపు మా పెళ్లి అయిన రోజన్నమాట. బాబోయ్, అప్పుడే మరో ఏడు గడిచిపోయిందన్నమాట! రోజులు ఎంత త్వరగా గడిచిపోతున్నాయి! ఎనిమిదేళ్లక్రితం తనిరోజున ఏం చేస్తుందో? అబ్బో ఎన్నని తలుచుకోగలదు? తనే పెద్దకూతురు. అది తమ ఇంట్లో జరుగుతున్న మొట్టమొదటి శుభకార్యం. అందుకే చాలా పెద్ద ఎత్తున పెళ్లిప్రయత్నాలు చేశారు. ఇంటినిండా చుట్టాలు, స్నేహితులు, పనివాళ్లు, మిఠాయిలు, సువాసనలు, పట్టుచీరల గరగరలు, పిల్లలగోల, రికార్డులు అబ్బో! ఒక రకమైన హడావిడా? సందడా? ప్రతివాళ్లు బిజీగానే ఉన్నారు. ఏం తోచకా, ఏం ఆలోచించాలో తట్టకా తను వాళ్ల వెనక కాస్సేపు, వీళ్ల వెనక కాస్సేపు తిరిగింది. అప్పటికే ఆలోచనలతో తన బుర్ర బరువెక్కిపోయింది! గమ్మత్తయిన మానసిక స్థితి! పెళ్లివారు తెల్లవారితేగాని రారు! రేపు రాత్రికి ముహూర్తం!

ఆ నాటి రాత్రి నిద్రపోయిందో, లేదో చెప్పలేదు! మొత్తానికి తెల్లవారింది. ఉదయం రైల్లో పెళ్లివారు దిగారు. ఓ పెద్ద హడావిడి! వాళ్లకి అందించడాలు, ఆడవాళ్లు విడిదిలోకి ఇంట్లోకి తెగ తిరగడం, మధ్య మధ్యలో నన్ను వెక్కిరించడం, పరిహాసాలాడడం, అలా గడిచిపోయింది

---

కుసుమా రంగారావు

---

*కొన్ని కొన్ని స్మృతులు కాలం గడిచినకొలదీ మరీ మధురంగా తయారవుతాయి. పెళ్ళినాటి స్మృతులను ఏ ఆడకూతురూ మరచిపోలేదు. అప్రయత్నంగానే మధుర స్మృతులలో తాను మరచిపోగలదు.*

---

వగలంతా. రాత్రి కొట్టకోలాహలంగా పెళ్ళి జరిగిపోయింది! తను మటుకు తలఎత్తి ఒక్కసారన్నా శ్రీవారిని చూడలేకపోయింది. ఎలా చూడ్డం బాబూ, చుట్టూతా కొన్ని వందల కళ్ళు చూస్తూంటే? కళ్ళ చివరల నించి చామనచాయగా ఉన్న చెంపలు! తలపాగా, మెళ్ళో దండలు మాత్రం కనిపించాయి. అరుంధతి దర్శనం సవధావ్యాల పితరా వగైరా తతంగం పూర్తి అయ్యేసరికి పన్నెండు దాటిందేమో? వరే ఇంతట్లో ఎవరో పాన్పు వేద్దాం అన్నారు. కొందరు "అర్ధరాత్రి ఇప్పుడెందుకర్రా?" అన్నారు. కాస్సేపు తర్జన భర్జనలు! ఎలాగైతేనేం పాన్పు అని, ఓ పూలదండ పడేసి ఆడమన్నారు. తనకు సిగ్గుతో ప్రాణం పోతూంది! ఆయనగారేమో హుషారుగా దండ విసిరేయడం మొదలుపెట్టారు! ఆ సందట్లో దొంగచాటుగా చూసింది తను. అబ్బ ఎంత మురిసిపోయిందో! ఇప్పుడిలా వడుకొని తలచుకుంటుంటే నవ్వుగా ఉంది గాని అప్పుడు, ఎంత ఇదిగా ఉందీ?

అదయ్యాక, కాస్సేపు మేను వాల్చనిచ్చారో లేదో తెల్లారిందంటూ లేపేశారు. పదీ పదిన్నర అయి ఉంటుంది. మళ్ళీ పాన్పు, పెళ్ళి కొడుకు అలకపాన్పు, అదీ, ఇదీ అనుకుంటున్నారు. మళ్ళీ కాస్సేపటికి పెళ్ళికొడుకు అలకపాన్పుమీద కారు కావాలి అంటున్నాడు అన్నారు. ఇం కాస్సేపటిలో ఇంటి వాతావరణమే మారిపోయింది. అందరూ దిగులుగా దిక్కు దిక్కుమంటున్నారు. తనకూ ఏదో గుబులుగా ఉంది.

మామగారు ఏమైనా సరే కొడుక్కి కారు ఇవ్వవలసిందే అని అంటున్నారు. నాన్నగారేమో, తనవల్ల కాదనీ, ఇలా శక్తికి మించిన కోరికలు తను తీర్చలేనని ఇప్పితంగా చెప్పేశారు. అసలు తప్పంతా వీళ్ళదే. మాకు కట్నం వద్దనీ, మీ శక్త్యనుసారం పిల్లకు పెట్టుకోండి అనీ ముందుగానే చెప్పారు. నాన్నగారు ఎంతో మురిసిపోయారు. అందుకనే తనకు బంగారం కూడా ఎక్కువగా పెట్టి, పెండ్లి ఇంత వైభవంగా చేశారు. వీళ్ళు తీరా ఇప్పుడు ఘరానాగా కారు కావాలి అంటున్నారు. ఇదిమటుకు కట్నం కాదా? కట్నానికి బదులు కాస్త నవీనంగా ప్రెజంట్ అంటున్నారు. అంతేగా? ఇలా అవుతుందనుకుంటే నాన్నగారు ఒప్పుకునేవారు కారు. ఎంతైనా, ఎంత మంచి సంబంధమైనా తలకు మించిన బరువు ఎత్తలేరు కదా? సంపన్నులయితే మాత్రం అంతా ఒక్క కూతురుకే ఇవ్వాలని లేదు కదా?

మామగారు "కారూ!" అంటూ భీష్మించుకున్నారు. ఆయన నోటికి జడిసి ఎవ్వరూ నోరెత్తడం లేదు. మొదటినించి ఆయన మహా మొండట. వాళ్ళతరపు



# దీపావళి ప్రత్యేక సంచిక

**23-10-68 104 పేజీలు వెల 60 పై.**

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక అక్టోబర్ 23 వ తేదీ సంచిక దీపావళి ప్రత్యేక సంచికగా వెలువడుతుంది.

దీపావళి కథల పోటీలో బహుమతులందుకొన్న మూడు ముచ్చటైన కథలతోపాటు, అనేక త్రివర్ణ చిత్రాలు, సచిత్ర వ్యాసాలు, సీరియల్ నవలలు మొదలైన అనేక ఆకర్షణలతో వస్తున్నది.

—ఎడిటర్

వారందరికీ ఈయనంటే చచ్చే హడలు. శ్రీవారుకూడా కిమన్నాస్తి. నాన్నగారు "ససేమిరా నావల్ల కాదు. ఇంత మోసం చేస్తారని తెలిస్తే అసలు నా కూతురికి పెళ్ళే చేసేవాడ్ని కాదు." అని అంటూ కండువా దులిపి భుజాన వేసుకుని వెళ్ళిపోయారు. మామగారు "కారు ఇచ్చేవరకు, కనీసం ఇస్తానని ఒప్పుకునేవరకు నేను, నా కొడుకు ఈ కొంపకే రాము" అంటూ కొడుకుని లాక్కుని విడిదిలోకి వెళ్ళిపోయారు. అటు వైపు ఆడవాళ్ళు, ఇటువైపు ఆడవాళ్ళు బొమ్మల్లా చూస్తూ ఉండిపోయారు.

పెళ్ళికొడుకు విడిదిలోకి వెళ్ళిపోయాక అందరిలో చలనం కనిపించింది. నెమ్మది నెమ్మదిగా తలో మాట విసరడం మొదలుపెట్టారు.

"ఇంత కర్కోటకుడేమమ్మా ముసలాయన?"

"ఉన్నది చాలదేమో? ఇంతా కట్టుకుపోతాడా?"

"ఛ, పెద్దమనిషట! మొద్దు మనిషి!"

"తల నెరిసినా పిన్నబుద్ధులు పోవు."

"అయినా ఇంత చదువు చదివిన ఆ పెళ్ళికొడుక్కి నోట్లో నాలిక లేదా? బెల్లం కొట్టిన రాయిలా కూచున్నాడు?"

"తండ్రికి బుద్ధిలేకపోతే ఆ కొడుక్కన్నా బుద్ధి లేదూ? ఆ మాత్రం జ్ఞానం ఉండక్కర్లా?"

"అంతమాత్రం స్వతంత్రించలేనివాడు పెళ్ళెందుకు చేసుకున్నాడు?"

"వట్టి చవటలా ఉన్నాడు! తండ్రివెంట ఎలా వెళ్ళిపోయాడో సన్నాసి."

ఇలా రకరకాల వ్యాఖ్యానాలు మొదలయ్యాయి. తనకు కళ్ళనీళ్ళపర్యంతమయిపోయింది. ఛా, ఇలా గొడవయిపోయింది ఎలాగ? అదేదో సినిమాలో లాగ విడిపోము కదా? మామగారు ఇంత చండశాసనుడా? ఇంకా నయం పెళ్ళిపీటలమీద లేపేశారుకాదు? వీళ్ళన్నట్టు ఈయన ఇంత చేతకానివారా? కర్మ! ఇది ఎలా పరిణమిస్తుంది? ఈ పోట్లాట ఇలాగే విరిచిపోతుందా? పోనీ నాన్నగారైనా ఆ కారు పడేయకూడదూ? ఈయన తండ్రికి నచ్చచెప్పకూడదూ? భగవంతుడి దయవల్ల ఆ మామగారు రాజీకి వస్తే ఎంత బావుంటుంది? ఇలా అంతూ దరీలేని ఆలోచనలతో కొట్టుకుపోతూంది తను.

ఇలా గొడవ గొడవగా ఇదమిద్ధమని తేలని ఆలోచనలతో చీకటిపడింది. "పనిలో పనిగా ఆ శుభకార్యం కాస్తా ముగిస్తే ఎంత బాగుండేది? ముసలాయన వట్టి ఛండాలపువాడు. తగూ పెట్టుకుని కూర్చున్నాడు. ఎవరంతటికి వాళ్ళు అభిమానపడి ఏడుస్తున్నారు. వీళ్ళు, ముందుగా అడిగితే కాదు పొమ్మంటాడేమో ముసలాయన అని భయపడుతున్నారు. వాళ్ళేమో ఆ ముసలి రావణాసురుడికి భయపడి మెదలకుండా ఊరుకున్నారు. అంతేగాని కుర్రాళ్ళ మనస్సులు ఒక్కరు పట్టించుకోపోతిరి!" అని నాయనమ్మ గట్టిగా విసుక్కోడం విని, తను లేచి పైకి తన గదిలోకి చక్కా పోయింది. భోజనాలు అవి అవుతున్నట్లున్నాయి. కిందంతా గొడవగా, వాదనలతో నిండిఉంది. తనకు తిండిమీద మనస్సెం పోతుంది? బెంగగా, భయంగాఉంది. తన గదిలోనే పడుకుని ఉంది.

ఎప్పుడు నిద్ర పట్టేసిందో, ఎవరో చెవిలో నెమ్మదిగా "వదినా, వదినా" అని లేపుతున్నారు. గబుక్కున లేచి కూచున్నా. పదేళ్ళ కుర్రాడు, వాళ్ళ తరపు చుట్టాలబ్బాయనుకుంటాను లేపుతున్నాడు. ఈ పిల్లాడు పెళ్ళిలోకూడా చలాకీగాతిరుగుతూ పందిట్లోనే నన్ను వరసలాడ్డం మొదలుపెట్టాడు. ఇంత రాత్రి సరసానికి వచ్చాడా అనుకుంటూ "ఏం బాబూ" అన్నా. వాడు చాలా నెమ్మదిగా "'అన్నయ్య నీ కీ ఉత్తరం ఇమ్మన్నాడు" అని చటుక్కున మాయమై పోయాడా సిసింద్రీ. తనకు క్షణం గుండె ఆగి కొట్టుకోడం మొదలుపెట్టింది! గొంతుకదగ్గరేవో అడ్డంపడినట్లయింది. ఆశ్చర్యం, భయం, ఎక్కడో కొద్దిగా సంతోషం, సిగ్గు ముంచెత్తాయి. ఏమి వ్రాశారు? ఎందుకు వ్రాశారు? నే నెలా చదవగలను? ఇప్పుడెలాగ? అని తెగ మథనపడిపోయాను. అప్పుడేమిటో మరీ అంత సిగ్గుగా, పిరిగ్గా, సంకోచంగా ఉండేది!

ఎలాగైతేనేం టేబుల్‌లైటు వేసి ఉత్తరం తెరిచింది. తన గదిలోకూడా నలుగురయిదుగురు దొరికిన చోటల్లా చాపవేసుకొని, జంబుఖానాలు వేసుకొని పడుకొని గురకలు తీస్తున్నారు. నెమ్మదిగా వణికే చేతులతో చదవడం మొదలుపెట్టింది.

తనకీ రోజుకు అందులో ప్రతి మాటా గుర్తు! గుర్తు అనడంకంటే కంఠతః వచ్చు అనవచ్చు. ఎన్నిసార్లు ఒంటరిగాను, జంటగాను చదివిందో? బీరువాలో ఇంకా భద్రంగా దాచింది. దానిలో ఇలా ఉంది:

"ప్రియమైన లలితా,

మీకీ విధమైన ఉత్తరం వ్రాయవలసి వస్తుందని కలలోకూడా అనుకోలేదు. దీనికి నేను చాలా బాధ పడుతున్నాను. అసలు విషయం సూటిగా చెబుతున్నాను. మీరు నన్ను సరిగ్గా అర్థం చేసుకొని నేను చెప్పినట్లు చేస్తారని ఆశిస్తున్నాను. మీరు వెంటనే బయలుదేరి దొడ్డితలుపునుండి వచ్చేయండి బయటకు. ఎదురుగా కారు, నేను సిద్ధంగా ఉంటాము. మనం వైజాగ్ వెళ్ళిపోదాము. ఇంతకన్నా గత్యంతరం లేదు. మా నాన్నగారి పట్టుదలను, మూర్ఖత్వాన్ని సడలించే ఓపిక, ఇష్టము రెండూ లేవు. బహుశః అవి నన్ను పుట్టించిన ఆ దేవుడికికూడా ఉండవని నా అనుమానం. అందువల్ల మన జీవితాలు పాడవకూడదు. ఇది కేవలం నా స్వార్థమే ననుకుంటాను. సామాను, బట్టలు అని హైరానా పడకండి. మీకు కావలసినవి అక్కడే కొనుక్కుందురు గాని. లేచి గమ్మున వచ్చేయండి. మిగిలినవన్నీ సమక్షంలో,

మోహనరావు."

తనకు దాదాపు మతి పోయింది. విశ్చేష్టురాలయి అలా కొంతసేపు కూర్చుండిపోయింది. ఏం చెయ్యాలి? ఇప్పుడెలాగ? వెళ్ళనా, వద్దా? వెళితే, అమ్మా నాన్నా వాళ్ళు ఏమనుకుంటారు? "కని, పెంచి పెద్ద చేసిన మమ్మల్ని క్షణంలో ఎలా మరిచిపోయింది? ఒక్క మాటన్నా చెప్పకుండా ఎలా వెళ్ళిపోగలిగింది? ఎంత సిగ్గుమాలిన పని చేసింది? మొగుడైతే మాత్రం వెళ్ళిపోవడమే? మా పరువు ఏమైపోవాలి? మేమే పంపాము అని నలుగురూ అనరూ? కారు కొనివ్వలేక కూతుర్ని దొంగచాటుగా అల్లుడితో పంపేశారు అని అంతా నవ్వరూ?" అని అనుకుంటారేమో? నాన్నగారు ఎంత బాధ పడతారు? అసలే ఆయనకు అభిమానం జాస్తి.

అయినా ముక్కూ ముఖం సరిగ్గా చూడని ఆయనతో ఎలా వెళ్ళడం? సిగ్గెయ్యదూ? వెళ్ళకపోతే ఆయనేమనుకుంటారు? 'మొదట్లోనే మొగుడంటే నమ్మకం లేకపోయింది ఇంతేకదా!' అని అనుకోరూ? 'నే నేమన్నా పరాయివాణ్ణా? ఇవ్వాళ రాకపోతే రేపన్నా నా దగ్గిరికి రాకుండా ఉంటుందా? అంత మాత్రానికి రాకపోయింది' అని అనుకుంటారేమో? కనీసం మనస్సులోనన్నా విసుక్కుంటారేమో? ఈ అవకాశం భగవంతుడు కల్పించినదేమో! దీన్ని జారవిడిచేసి జీవితాంతం ఏడవవలసి ఉంటుందేమో?

అలా ఎటూ తేల్చుకోలేక చచ్చిన చావుగా అయిపోయింది. ఒక వైపు భయం, తొందర, చేస్తున్న పని మంచా, చెడా అని అలా గిలగిల్లాడిపోయాను. అంతటి పెద్ద సమస్యే ఇప్పటివరకూ రాలేదు. అయినా అంత చిన్నతనంలో స్వతంత్రించి ఏ పని మటుకు చెయ్యగలం? ఆలోచించగలం? అల్లా కట్టుకున్నవాడితోనే లేచిపోయే దుస్థితి ఏ ఆడపిల్లకూ కలిగి ఉండదనుకుంటా!

చివరకు తను కలలో నడుస్తున్నట్లు నాలుగు

(తరువాయి 63 వ పేజీలో)

# స్మృతి

(11 వ పేజీ తరువాయి)

తడిల బట్టలు చేతిసంచిలో పెట్టుకొని కన్నీళ్ళు తుడుచుకుంటూ నెమ్మదిగా మెట్లు దిగి పెరటి తలుపులు తెరిచి బయటికి వచ్చింది. వెంటనే తన చేతిలో సంచి తీసుకొని తన్ను పొదివి పట్టుకొని కార్లోకి ఎక్కించి తనూ ఎక్కి కూర్చున్నారు శ్రీవారు. కారు వెంటనే స్టార్టయి రయ్యిన దూసుకుంటూ ముందుకు సాగింది. ఎలా అంతటి సాహసం చెయ్య గలిగిందో? అంత అమాయకంగా ఉండే తను అప్పుడు ఎలా ఆ నిర్ణయానికి రాగలిగిందో? ఏ శక్తి అలా ముందుకి తోసిందో! లేకపోతే అంత ధైర్యం, చొరవ తన కెక్కడివి? ఎలాగైతే కార్లోకి ఎక్కింది గాని తను, తరవాత ఒకటే భయం, దిగులు, ఏడుపూ! పాపం, ఆయనకూడా ఏమీ అనకుండా చాలా పెద్ద మనిషి తరహాగా చెయ్యి తీసుకొని నిమురుతూ ఉండి పోయారుగాని నోరెత్తి ఒక్క మాట మాట్లాడలేదు.

అప్పుడు శ్రీవారు వైజాగ్‌లో అనాటమీలో ఉండేవారు. గారాల కొడుకేమో, ఇల్లూ, వంటమనిషి, స్నేహితులు బాగా అట్టహాసంగా ఉండేవారు. మామగారు వాళ్ళు బొబ్బర్లంకలో ఉండేవారు. సిగ్గుతో, భయంతో గడిచిన ఆ రోజులు తలుచుకుంటే శరీరమూ, మనస్సూ పులకరిస్తాయి. ప్రతిదానికి తనకు సంకోచం, మొహమాటం. ఆయన ఎంతో సున్నితంగా, ఆప్యాయంగా ఆదరించారు కనకనే తను విశ్రాంతగా ఉండిపోగలిగింది. ఆయన పది మాటలు మాట్లాడితే తను ఒక్క మాట మాట్లాడ గలిగేది. అంత బెరుగ్గా ఉండేది. అందుకే ఇప్పుడు వేళాకోళం చేస్తూ, "రోజులు తారుమారయ్యాయి. ఇప్పుడు నీవు వక్తవు, నేను కేవలం శ్రోతను" అంటూ ఉంటారు!

తరవాత ఎన్నాళ్ళకో కోపతాపాలు తగ్గాయి. బాబు పుట్టినప్పుడు నాన్నగారు కారు తాళాలు మనవడికి చదివిస్తూ గర్వంగా, "బావగారూ, మీ కొడుక్కిమటుకు ఇవ్వలేదు" అన్నారు. మామగారు ముసిముసిగా నవ్వుతూ, "మొత్తానికి మాదేకదా? నా కొడుక్కి కాకపోతే నా మనవడికి" అన్నారు మీసాలు సవరించుకుంటూ.

'అరే నాలుగయి పోయింది! ఈ ఆలోచనల్లో పడ్డాక ఎక్కడి పనులక్కడే ఉన్నాయి. అంతా ఇంటికి చేరుకుంటారు' అని గబగబా కుర్చీలోంచి లేచి వంట ఇంట్లోకి నడిచింది.

కాని పాపం! సినిమాల్లో చూపే శోభనపుగదీ, పేరంటాళ్ళు, పెళ్ళికూతుర్ని లోపలికితోసి నవ్వుకుంటూ తలుపు గడియపెట్టడం వగైరాలు చూచి మోహన రావు చెవిలో మెల్లగా, "ప్చ్ ఆ అనుభవం మనకు లేకపోయింది మీనాక్షీ" అని అంటూ క్షణం బాధ పడుతూంటుంది లలిత! ★

